సాక్షి కర్నూలు

మంగళవారం। 31। జనవరి। 2023



రమణీయం..ఉచ్చాయం

హొళగుంద: సిద్ధేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని సోమవారం రాత్రి మండల కేంద్రమైన హొళగుందలో ఉచ్చాయం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం శ్రీశైలం దేవస్థానం సహస్రదీపార్చన సేవ చేపట్టింది. అనంతరం వెండి రథోత్సవం నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,616.74
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:52.665
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,386

న్యూస్‌రీల్

పెద్దాసుపత్రిలో విజిలెన్స్ విచారణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ జరిపారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన వైద్యపరికరాల గురించి వారు ఆరా తీశారు. ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా ఎన్ని పరికరాలు కొనుగోలు చేశారు, అప్పటి ఆసుపత్రి అధికారులు ఎన్ని పరికరాలు కొనుగోలు చేశారని సిబ్బందిని ప్రశ్నించగా మొత్తం 32 పరికరాలు వచ్చాయని, అందులో 8 మాత్రం స్థానికంగా కొనుగోలు చేసినట్లు వివరించారు. దీంతో పాటు గతంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు సైతం వారు అడిగినట్లు సమాచారం.

వైఎస్సార్ పెన్షన్ కానుకకు రూ.126.66 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ఫిబ్రవరి నెలకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.126.66 కోట్లు విడుదలయ్యాయి. మంగళవారం వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి నిధులను డ్రా చేస్తారు. 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి పింఛన్ల పంపిణీ మొదలుకానుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. కర్నూలు జిల్లాలో 2,39,678 పింఛన్లకు రూ.66,58,77,500.. నంద్యాల జిల్లాలో 2,17,784 పింఛన్లకు రూ.60,07,90,500 పంపిణీ చేయనున్నారు.

వైభవంగా మధ్వనవమి వేడుకలు



మధ్వాచార్యుల చిత్ర పటానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం మధ్వ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు నేతృత్వంలో వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి నిర్మల్య విసర్జన, అభిషేకాలు, అలంకరణలు చేసి పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్వాచార్యుల చిత్ర పటాన్ని బంగారు రథంపై కొలువుంచగా పీఠాధిపతి పుష్పార్చన, హారతులు పట్టారు. రథయాత్రకు అంకురార్పణ పలికారు. మధ్వనవమి ప్రశస్తిపై భక్తులకు సందేశం ఇచ్చారు.

ఉపాధి పనులకు పెరుగుతున్న హాజరు

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి పనులకు కూలీల హాజరు పెరుగుతోంది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఉపాధి పనులకు డిమాండ్ గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. రోజుకు లక్ష మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యం. ఇందులో 58.09 శాతం అచీవ్ అయినట్లు తెలుస్తోంది. ఈ నెల 28న ఉపాధి పనులకు 52,811 మంది హాజరయ్యారు. ఈ నెల 30న 58,093 ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. లేబర్ రిపోర్టింగ్ పెంచడంపై డ్వామా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో సోమవారం ఉపాధి పనులకు 58వేలకు పెరుగడం విశేషం.

నడక మార్చుకో, గొంతు ఎందుకిలా



మాది కర్నూలు. నాకు ఒక అన్న, ముగ్గురు చెల్లెళ్లు. చిన్నప్పటి నుంచి నాకు ఆడపిల్లగా ఉండటమే ఇష్టం. ఆరో తరగతి నుంచి నాలో వస్తున్న మార్పులను చూసి అమ్మా, నాన్న చాలా తిట్టేవారు. ఎందుకలా నడుస్తున్నావు, గొంతు ఎందుకలా అవుతోంది.. మార్చుకుంటావా లేదా అని రోజూ హింస. అయినా ఇదంతా మేము కోరుకుని తెచ్చుకుంది కాదు కదా. జన్యు లోపం వల్ల వచ్చిన దానికి మేం ఏం చేస్తాం.

– అనుశ్రీ

సమాజంలో తలెత్తుకునేది ఎలా..



మాది వెల్దుర్తి. నాకు ఒక అక్క ఉంది. మా నాన్న టీచర్. అమ్మ గృహిణి. పదో తరగతి వరకు చదువుకున్నా. చిన్నప్పటి నుంచి నాలోని మార్పులను గమనించి ఎక్కడెక్కడో చికిత్స చేయించారు. అయితే డాక్టర్లు కూడా ఏమీ చేయలేమన్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా అయితే, సమాజంలో ఎలా తలెత్తుకుని తిరిగేదని చాలా బాధపడేవారు. అయితే అమ్మ మాత్రం నన్ను అర్థం చేసుకుంది.

– సమీర

నిజం అయితే బయటకు వెళ్లిపో..



నాకు ఒక అక్క ఉంది. చిన్నప్పటి నుంచి నాలో వచ్చే మార్పులను గమనించి బయటి వాళ్లు ఇంటికి వచ్చి మీ వాడు ఏంటి ఇలా అని చెప్పడంతో తరచూ గొడవలు అయ్యేవి. నాన్న పట్టించుకోకపోవడం, అమ్మ అనారోగ్యం కారణంగా నాన్నమ్మ నా బాగోగులు చూసుకునేది. ఒకరోజు బయటి వాళ్లు చెప్పేవి నిజం అయితే ఇంట్లో ఉండకు అంది. అప్పుడు ఒక వంద రూపాయలు ఇవ్వమని అడిగి ఇంక నా మీద ఆశలు వదిలేసుకోమని బయటకు వచ్చేశా.

– భావన, కర్నూలు

కన్నీటి చుక్కలు!

కర్నూలు జిల్లా నియోజకవర్గాల వారీగా 'ఇతరుల' ఓటరు జాబితా	
కర్నూలు	37
పాణ్యం	75
పత్తికొండ	20
కోడుమూరు	10
ఎమ్మిగనూరు	43
మంత్రాలయం	18
ఆదోని	43
ఆలూరు	48

నంద్యాల జిల్లా నియోజకవర్గాల వారీగా 'ఇతరుల' ఓటరు జాబితా	
ఆళ్లగడ్డ	17
శ్రీశైలం	45
నందికొట్కూరు	12
నంద్యాల	95
బనగానపల్లె	34
డోన్	81

(అనధికారికంగా వీరి సంఖ్య 30వేల పైనే)



రిషారెడ్డి

మనసున్న 'హిజ్రా'

- ఇంట్లో ఉండలేక, బయట జీవించలేక..
- సమాజంలో ఇప్పటికీ అంటరానివారిగానే
- మానవత్వంలో వాళ్లకు వాళ్లే సాటి
- సంపాదనలో అధిక శాతం సేవా కార్యక్రమాలు
- గురుచేల బంధంతో ఒక సమూహం
- ఒకరికొకరు తోడుగా జీవనం



నంద్యాల: భిక్షాటనలో భాగంగా సరదా చిత్రం

మెరిసే అందం వెనుక చెప్పుకోలేని చీకటి.. కురిసే నవ్వుల వెంట భరించలేని బాధ. గలగల పారే మాటల మాటున లోతైన వేదన.. వెంటాడే చూపులకు తోడుగా తీరని వెతలు.. చేతులు చేసే శబ్దంలో కనిపించని మౌనం.. భిక్షమెత్తుకుంటూనే కరిగిపోయే హృదయం.. సాటి మనిషికి కష్టమంటే పరుగున వచ్చే మానవత్వం.. తనకు తానే కొవ్వొత్తి జీవనం.. హిజ్రా!

– సాక్షి, కర్నూలు డెస్క్



మాతా

కొజ్జా.. పాయింట్ ఫైవ్.. హిజ్రా.. ఒక్క మనిషికి ఎన్నో పేర్లు. ఆడ.. మగ తరహాలోనే జన్మించినా.. అడుగడుగునా అవమానాలు. పురాణాల్లో ప్రస్తావన ఉన్నా.. చట్టాలు గుర్తింపునిచ్చినా.. ఆడవాళ్లు తమలో కలుపుకోరు, మగవాళ్లు దగ్గరికి రానివ్వరు. ఉన్నత చదువులు చదివినా.. ఉన్నతంగా బతుకుతున్నా.. ఓ ఇంటి వాళ్లు కాలేరు, ఓ తోడు వెంట రాదు. గతానికి భిన్నంగా జీవనం సాగిస్తున్నా.. సమాజ మార్పులకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటున్నా.. కలిగినదాంట్లో కలోగంజో తాగుతూ ఇతరుల బాధను పంచుకుంటున్నా.. ఇప్పటికీ ఆ 'తేడా' అలిగే మిగిలిపోయింది. ఇంటికి దూరంగా.. సమాజానికి ఆవల.. చస్తూ బతుకుతున్న హిజ్రాల జీవనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం వారి మాటల్లోనే..

పురుషుడి ఆకారంలో జీవిస్తున్నా, మనసు ఆడపిల్లగానే ఉండటం వల్ల మానసిక సంఘర్షణ అధికం. ఇంట్లో చెప్పుకోలేక, బయటకు తెలిస్తే ఏమవుతుందో తెలియక చస్తూ బతుకుతుంటాం. ఎవరూ లేని సమయంలో స్త్రీ వేషధారణతో మురిసిపోతుంటాం. వయస్సు పెరుగుతున్న కొద్దీ మాలో వచ్చే మార్పులతో ఆ విషయం ఎప్పుడో ఒకప్పుడు బయటపడుతుంది. అప్పటి నుంచి మా జీవితం మరింత నరకం అవుతుంది. ఒకానొక దశలో ఇక మా సమూహాన్ని వెతుక్కుంటూ బయటకు వచ్చేస్తాం.

అద్దెకు ఇల్లు కూడా దొరకదు

కుటుంబ సభ్యుల ఆదరణ లేక.. బంధువులు, స్నేహితులు అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో ఇంట్లో నుంచి బయటపడుతుంటాం. ఆ తర్వాత మమ్మల్ని మేము కాపాడుకునేందుకు నిత్యం అవస్థలే. ఏదో ఒక పని చేసుకుందామంటే ఎవరూ ఇవ్వరు. కనీసం తలదాచుకుందామంటూ ఇల్లూ కూడా అద్దెకు దొరకదు. ఎవరైనా దయతలచి ఇచ్చినా, చుట్టుపక్క వాళ్ల గొడవతో ఖాళీ చేయాల్సి వస్తుంది. మేమూ ఆడపిల్లలమే అనే విషయం ఈ సమాజం ఎప్పటికి గుర్తిస్తుందో తెలియదు.

సమూహాలుగానే జీవిస్తాం..

ఇంట్లో ఎలాంటి శుభకార్యాలు జరిగినా మమ్మల్ని పిలవరు, మాలో మేము, మాతో మేము బతుకుతాం. ఒంటరిగా జీవిస్తే ప్రతి ఒక్కరి కన్ను మాపైనే ఉంటుంది. అందువల్ల మేము గుంపుగా కలసిమెలసి జీవించేందుకే ఇష్టపడతాం. స్వయం ఉపాధిపైనా దృష్టి సారించాం. ఇప్పుడిప్పుడే మాలో కొందరు ఆ దిశగా రాణిస్తున్నారు.

ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది

ఒకప్పుడు మమ్మల్ని చూస్తేనే అసహ్యించుకునేవాళ్లు. బస్సుల్లో పక్కన కూర్చొంటే కూడా పక్కకు లేచి వెళ్లేవాళ్లు. చాలా బాధాకర జీవనం గడుపుతుంటాం. అయితే ఇటీవల కాలంలో సమాజంలో చాలా మార్పు కనిపిస్తోంది. మమ్మల్ని కూడా మనుషుల్లా చూస్తున్న తీరు కాస్త సంతోషాన్ని కలిగిస్తుంది. అయితే ఇంకా చాలా మార్పు రావాలి. మమ్మల్ని కూడా ఆడపిల్లగానే చూసినప్పుడే మా జీవన విధానంలో మార్పు వస్తుంది.

గురుచేల బంధం..

ప్రతి ఒక్క హిజ్రా ఒక గురువు కింద శిష్యరికం చేయాల్సి ఉంటుంది. అప్పుడే సమూహంలో చోటు దక్కుతుంది. ఒక్కో గురువు పరిధిలో వందల నుంచి వేల సంఖ్యలో శిష్యులు ఉంటారు. హిజ్రాగా మారిన వ్యక్తి గురువును ఆశ్రయిస్తే.. తన పరిధిలోని శిష్యులను అత్త, తల్లిని పరిచయం చేస్తారు. సమూహంలో అత్తకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. 11వ రోజు మంగళస్నానం చేయించడంతో తల్లి పాత్ర దాదాపుగా ముగుస్తుంది. ఆ తర్వాత వాళ్లకు ఇష్టం వచ్చినప్పుడు బట్టలు పెట్టడం, ఇంటికి ఆహ్వానించడం జరుగుతుంది. 40 రోజుల మాత పూజ తర్వాత గురువు తాళి కట్టి, మెట్టెలు తొడగటం.. మరుసటి రోజు జల్సాకు పెళ్లి కూతురులా ముస్తాబు చేసి పెద్ద ఎత్తున జల్సా చేయడం జరుగుతుంది. దీన్నే గురుచేల బంధంగా పరిగణిస్తున్నారు.

అడ్డుక్కోవడం ఒక్కటే ఉపాధి

బాగా చదువుకోవాలని ఉన్నా, ఎక్కడికక్కడ మాకు అవాంతరాలే ఎదురవుతుంటాయి. మా హావభావాలను అందరూ వెలెత్తి చూపేవాళ్లే కానీ, వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లు చాలా అరుదు. ఇక మాకు పని కల్పించమంటే ఎవరూ ముందుకురారు. ఈ పరిస్థితుల్లో అకలితో చావలేక విధిలేని పరిస్థితుల్లో రోడ్డున పడుతున్నాం. దుకాణాల వద్దకు వెళ్లి చేయి చాస్తున్నాం. ఇదొక్కటే మాకు ఉపాధి. వచ్చిన డబ్బునే అందరూ పంచుకుంటాం. ఇందులోనే దేవుని పేరిట కొంత సొమ్ము తీసిపెడుతుంటాం.

బయటకు చెప్పుకోలేని వాళ్లు ఎందరో..

మేము పురుషులం కాదు, మాలో స్త్రీ లక్షణాలు ఉన్నాయని తెలిసినప్పటి నుంచి మాలో మేము ఎంతో నలిగిపోతుంటాం. బయటపడకుండా ఎంత జాగ్రత్తపడినా ఎలాగోలా తెలిసిపోతుంది. కొందరు విధిలేని పరిస్థితుల్లో ఇళ్లు వదిలి బయటపడుతుండగా.. కొందరు బయటకు చెప్పుకోలేక, సమాజం దృష్టిలో తనను తాను చిన్నబుచ్చుకోలేక ఇప్పటికీ ఎందరో ఒంటరిగానే మిగిలిపోతున్నారు. చాలామంది ఉద్యోగుల్లోనూ హిజ్రాలు ఉన్నారు. అయితే అతికొద్ది మంది మాత్రమే బయటకు వచ్చి సమూహంలో కలిసి జీవిస్తున్నారు.

సేవ చేస్తాం.. చెప్పుకోం..

మేము సంపాదించే డబ్బులో అధిక శాతం సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తాం. మా ఇంటి దగ్గరికి వచ్చి ఎవరు ఏ సాయం అడిగినా ఉన్నంతలో చేసేందుకు వెనుకాడం. ఎంతో మందికి పెళ్లి విషయంలో, అనారోగ్యం విషయంలో డబ్బుతో పాటు తాళి బొట్లు అందిస్తుంటాం. ఒంటరి మహిళలు మాకు దిక్కులేదని మా దగ్గరికి వచ్చి నిలబడుతుంటారు. అలాంటి వాళ్లకు చేతనైంది చేసి పంపుతుంటాం. అంతెందుకు కరోనా సమయంలో మా జీవనమే దుర్భరంగా మారినా ఉన్నదాంట్లో ఎంతో మంది నిరాశ్రయుల కడుపునింపే ప్రయత్నం చేశాం.



నందికొట్కూరు: కరోనా వేళ ఆపన్న హస్తం

రాముడే వరమిచ్చాడంటారు..

లోకా సమస్తా సుఖినోభవంతు అనే భావనతోనే మేము జీవిస్తుంటాం. లోక కల్యాణాన్నే కోరుకుంటాం. మా జీవితం ఆశీర్వదించడానికే అని మా గురువులు మాకు బోధించారు. అంతెందుకు మా పెద్దలు ఒక కథ చెబుతుంటారు. రాముడు అరణ్యవాసానికి వెళ్లే సమయంలో ఎక్కడెక్కడి నుంచో ప్రజలు ఆయనను చూడటానికి తరలివస్తారు. అప్పుడు రాముడు మగవాళ్లు, ఆడవాళ్లు జాగ్రత్తగా ఇళ్లకు వెళ్లండని చెబుతారు. అయితే మన గురించి ఏమీ చెప్పలేదని హిజ్రాలు రాముడు తిరిగివచ్చే వరకు అక్కడే ఉండిపోతారు. అరణ్యవాసం పూర్తయ్యాక రాముడు అయోధ్యకు చేరుకోగానే.. స్వామి మీరు వెళ్లేటప్పుడు ఆడవాళ్లు, మగవాళ్లను ఉద్దేశించి మాత్రమే మాట్లాడారు. మా పరిస్థితి ఏమిటి, మేము మీ మాట కోసం ఇక్కడే ఉండిపోయామని వేడుకుంటారు. అప్పుడు రాముడు.. 'మీ వాక్కు ఫలించుగాక' అని దీవించారు. అప్పటి నుంచి మా నోటి నుంచి వచ్చే మాట ఫలిస్తుందనే నమ్మకం ప్రజల్లో కూడా ఏర్పడింది.



మాత పూజతో అమ్మాయిలా..



పురుషుడిగా బయటకు కనిపించినా.. మనసు మహిళగానే ఉంటుంది. అందువల్ల మాకు అవసరం లేని అవయవాలు తొలగించుకునేందుకు ఎన్నో అవస్థలు పడతాం. ఆ తర్వాతే మేము స్త్రీగా జీవిస్తాం. గతంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వల్ల దాయిమా(వయస్సు పైబడిన 80 ఏళ్ల హిజ్రాలు)లు మాకు అనవసర అవయవాలు తొలగించేవాళ్లు. అది మాకు చావు బతుకుల సమస్య. ఇప్పుడు అలాంటి వాళ్లు లేరు. ఇప్పుడు వైద్యుల వద్దే ఆపరేషన్ చేయించుకుంటున్నాం. ఈ ప్రక్రియను నిర్వాణ్ అంటాం. ఆ తర్వాత 40 రోజుల వరకు ఒంటరిగానే ఒక గదిలో ఉండిపోతాం. 11 రోజులకు, 21 రోజులకు, 31 రోజులకు మంగళస్నానాలు చేయిస్తాం. ఆ సమయంలో మేము ఒకరినొకరు చూసుకునేందుకు కూడా ఇష్టపడం. కనీసం అద్దంలో మమ్మల్ని మేము కూడా చూసుకోం. ఇక 40 రోజుల తర్వాత మాత పూజ ఉంటుంది. ఆపరేషన్ చేయించుకున్న వాళ్లకు మంగళస్నానం చేయించి నెత్తిన పాల కడవతో అమ్మవారికి పూజ చేయిస్తాం. అప్పుడే అమ్మ వారికి మా పురుషత్వాన్ని అప్పగించి, మహిళగా మిగిలిపోతాం. అప్పుడు మా గురువు మాకు తాళిబొట్టు కట్టి మెట్టెలు తొడుగుతారు. ఇది మా జీవితాల్లో అతి పెద్ద పండుగ. ఇక 41వ రోజు జల్సా నిర్వహిస్తాం. అప్పుడు మేమంతా ఒక్కచోటకు చేరి పండుగ చేసుకుంటాం. ఆడిపాడుతాం.. ఆ రోజు రాత్రంతా మమ్మల్ని మేము మైమరిచి జీవిస్తాం.

మనసుపడతాం కానీ..



మాకూ మనసు ఉంటుంది. ఒక తోడు ఉంటే సమాజంలో గౌరవంగా బతకవచ్చనే ఆలోచన వస్తుంది. ఎవరో ఒకరిని ఇష్టపడతాం.. కానీ బయటకు చెప్పలేం. కొందరు మా వెంటపడతారు.. తోడుగా ఉంటామని మాయ మాటలతో దగ్గరవుతారు. నమ్ముతాం.. మా సర్వస్వాన్ని వాళ్లకు అర్పిస్తాం. మా అందం, డబ్బు వాళ్ల సొంతం చేసుకుంటారే కానీ, మాకు సమాజంలో గౌరవం కల్పించే విషయంలో ఎప్పుడూ వెనకడుగే. ఎందుకిలా అని నిలదీస్తే తన్ని తరిమేస్తారు.

మా బతుకు కొవ్వొత్తిలాంటిదే..



ఇంట్లో తెలిసినప్పుడు కుటుంబ సభ్యులకు చెడ్డపేరు రాకూడదని మమ్మల్ని మేము శిక్షించుకుంటాం. అక్కకు పెళ్లి కాదని, తమ్ముడిని హేళన చేస్తారని.. బయటి వాళ్లు అసహ్యించుకుంటారనే మాటలతో మేమే బయటికి వచ్చేస్తాం. బయటకు వచ్చినా సమాజ మేలు కోరుకుని బతుకుతుంటాం. మనసిచ్చిన వాడు మోసం చేసినా మౌనంగా భరిస్తాం. పెళ్లి విషయంలో అబ్బాయి ఇంట్లో గొడవలు జరిగినా మాకు మేము సర్దిచెప్పుకొని దూరంగా ఉండిపోతాం. మేము కొవ్వొత్తిలా వెలుగులు ఇస్తూ చీకట్లోనే ఉండిపోతుంటాం.

వృత్తుల అభివృద్ధికి 'జగనన్న చేదోడు'

- జిల్లాలో 12,856 మంది లబ్ధిదారులకు రూ.12.85 కోట్లు జమ
- మూడో విడత విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రజకులు, నాయి బ్రాహ్మణులు, టైలర్లు
- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్, కోడుమూరు ఎమ్మెల్యే



జగనన్న చేదోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు(అర్బన్): వివిధ వృత్తులు చేసుకుంటున్న వారికి జగనన్న చేదోడు పథకం ఎంతో ఉపయోగపడుతున్నదని జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు అన్నారు. ఒక్కో లబ్ధిదారునికి ఏడాదికి రూ.10 వేలు విడుదల చేస్తున్న నేపథ్యంలో పెట్టుబడి సాయంగా ఆయా వృత్తులను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం కింద రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు మూడో విడత ఆర్థిక సహాయం విడుదల చేసింది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించేందుకు ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నాగేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం కింద మొదటి విడతలో 12,191 మంది లబ్ధిదారులకు రూ.12.19 కోట్లు, రెండో విడతలో 11,222 మందికి రూ.11.22 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ప్రస్తుతం మూడో విడతలో 12,856 మంది లబ్ధిదారులకు రూ.12.85 కోట్లు జమ చేస్తున్నట్లు చెప్పారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా నవరత్నాల్లో భాగంగా అన్ని పథకాలకు నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. మూడో విడత విడుదలైన రూ.12.85 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జీవీ కల్పన, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ జే రేవతి, రజక సంక్షేమ కమిటీ సభ్యురాలు భారతి పాల్గొన్నారు.

లబ్ధిదారుల వారీగా విడుదలైన మొత్తం...

వృత్తి	లబ్ధిదారులు	విడుదలైన మొత్తం
టైలర్లు	6538	రూ.6.53 కోట్లు
రజకులు	3656	రూ.3.65 కోట్లు
నాయీ బ్రాహ్మణులు	2662	రూ.2.66 కోట్లు

'స్పందన' అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి, చిత్రంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా గడువులోపు పరిష్కరించాలని అధికారులను జేసీ ఎస్. రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, సీపీఓ అప్పలకొండతోపాటు పలువురు జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిల్లా కేంద్రానికి వస్తున్నారని, అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ వారంలో ఒక్క అర్జీ మాత్రమే రీ ఓపెన్ అయినట్లు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల ముఖ హాజరు నమోదు శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ యాప్‌లో కచ్చితంగా హాజరు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కుష్టువ్యాధి నిరోధక పోస్టర్లు, కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు.

స్పందనకు వచ్చిన సమస్యల్లో కొన్ని..

- మా తాతలు, ముత్తాల కాలం నుంచి అనుభవంలో ఉన్న సర్వే నంబర్ 45/2లోని ప్రభుత్వం భూమిని తమకు కాకుండా ఊరికి సంబంధంలేని వారికి పట్టాలు ఇవ్వడం అన్యాయమని వెల్దుర్తి మండలం సర్పరాజపురానికి చెందిన వడ్డే లక్ష్మీదేవి ఫిర్యాదు చేసింది.
- రాయలసీమ యూనివర్సిటీలో చదువుతున్న తనపై వీసీ, రిజిస్ట్రార్ కక్షకట్టి వేధింపులకు గురిచేస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించి కాలేజీలో చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని వర్సిటీకి చెందిన నరేష్ అనే విద్యార్థి ఫిర్యాదు చేశాడు.
- స్వచ్ఛాంధ్ర క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లోని వేతనాలు చెల్లించాల నిసీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కోరారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై నేడు సమీక్ష

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. శ్రీశైల దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించే సమీక్షకు ఆయా శాఖల జిల్లా అధికారులు హాజరుకానున్నారు.

ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించండి




జెడ్పీలో జరిగిన ఏకసభ్య కమిషన్ సమావేశంలో మాట్లాడుతున్న శామ్యూల్ ఆనంద్ కుమార్, హాజరైన కుల సంఘాల నాయకులు

- వాస్తవ స్థితిగతులపై నివేదికలు అందించండి
- ఏకసభ్య కమిషన్‌కు విన్నవించిన వాల్మీకులు
- ఎరుకలి, యానాది, చెంచులకు ప్రత్యేక ఆచార వ్యవహారాలు... గిరిజన సంఘాలు

కర్నూలు(అర్బన్): దశాబ్దాలుగా తీవ్ర అన్యాయానికి గురైన వాల్మీకి/ బోయలకు తిరిగి ఎస్టీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని పలువురు వాల్మీకి నేతలు కోరారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని అనేక గ్రామాల్లో నివసిస్తున్న వాల్మీకుల వాస్తవ స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదికలను ప్రభుత్వానికి అందించాలని వారు కోరారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ప్రభుత్వం రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే ... రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వాల్మీకుల వాస్తవ స్థితిగతులను అధ్యయనం చేస్తున్న ఈ కమిషన్ సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించింది. కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య, జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి. వెంకటలక్షుమ్మ, ఆర్‌డీఓ హరిప్రసాద్, వాల్మీకి/ బోయ కార్పొరేషన్ చైర్మన్ డా.బి. మధుసూదన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరామయ్య, మెడికల్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డా.భవానీ ప్రసాద్, వాల్మీకి నేతలు జ్ఞానేశ్వరమ్మ, కుబేర స్వామి, సత్రం రామకృష్ణుడు, బోయ క్రాంతినాయుడు, రంగమునినాయుడు, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, రాము, సుగాలి రాముడు, సహాయ సాంఘిక సంక్షేమాధికారి బి. మద్దిలేటితో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వాల్మీకి సంఘాల నాయకులు, గిరిజన సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను కమిషన్‌కు నివేదించారు.

పేదరికం, నిరక్షరాస్యత, వలసలే అధికం

జిల్లాలో మెజారిటీ జనాభాగా వాల్మీకులు ఉన్నా ... పేదరికంలోనే అనేక మంది మగ్గుతూ ప్రతి ఏడాది వలస బాట పడుతున్నారని పలువురు వాల్మీకి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికం కారణంగా నిరక్షరాస్యత కూడా అధికంగానే ఉందన్నారు. వివిధ కారణాలతో ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని ఎస్టీలుగా, మైదాన ప్రాంతాల్లో ఉన్న వాల్మీకులను బీసీలుగా విభజించారన్నారు. దీని వల్ల మైదాన ప్రాంతాల్లోని వాల్మీకులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారన్నారు. ఎలాంటి కుల వృత్తి లేని కారణంగా చేసేందుకు పనులు లేక చాలా మంది దుర్భరజీవనం గడుపుతున్నారన్నారు. ఆచార వ్యవహారాలు, గోత్రాలు ఎరుకలి వారివి తమవి ఒకటే అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలోనే వాల్మీకుల్లో ప్రాంతీయ వ్యత్యాసం ఉందన్నారు.

ప్రభుత్వానికి అధ్యయన నివేదికలు

రాష్ట్రంలోని వాల్మీకి/ బోయ వర్గాల స్థితిగతులను అధ్యయనం చేసిన నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని కమిషన్ చైర్మన్ శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ చెప్పారు. తాము పర్యటించిన ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వాల్మీకి/ బోయ, గిరిజన వర్గాల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. – శామ్యూల్ ఆనంద్‌కుమార్

ఎరుకలి, యానాది, చెంచులకు ప్రత్యేక ఆచార, వ్యవహారాలు ...

ఎస్టీలోని 35 ఉప కులాలకు ప్రత్యేకంగా ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, భాష ఉన్నాయని పలువురు గిరిజన సంఘాల నాయకులు చెప్పారు. నేటికీ ఎరుకలి, యానాది, సుగాలి, చెంచు కులాలు ఊరి చివర్లో, అడవుల్లో నివాసం ఉంటున్నాయన్నారు. గిరిజనులకు ప్రభుత్వం కల్పించిన ఆరు శాతం రిజర్వేషన్‌లో కూడా 3 శాతం రిజర్వేషన్ ఇతర కులాలకు చెందిన వారు బోగస్ గిరిజన సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఈత బుట్టలు, పందుల పెంపకం ద్వారానే ఎరుకలు నేటికీ జీవనం సాగిస్తున్నారన్నారు. సుగాలీలు కొండలకు వెళ్లి కట్టెలు కొట్టుకొని సమీపంలోని పట్టణ ప్రాంతాల్లో వాటిని అమ్ముకొని జీవనం చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి తమ కడుపులు కొట్టొద్దన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఆయా సంఘాల నాయకులు, ప్రజలు తమ అభిప్రాయాలను వినతి పత్రాల రూపంలో కమిషన్‌కు అందించారు.

నేను ఎస్టీ .. నా బిడ్డలు బీసీ-ఏ నా

- కమిషన్ ఎదుట ఆవేదన వెల్లగక్కిన రిటైర్డు ప్రభుత్వ ఉపాధ్యాయుడు

డోన్: తమ నోటికాడి కూడు లాగేసిన గత ప్రభుత్వాల తప్పిదాలను సరిదిద్దాలని రిటైర్డు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వాల్మీకి సంఘం నేత రామచంద్రనాయుడు ఏకసభ్య కమిషన్ రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎస్టీ జాబితాలో బోయలను చేర్చే అంశమై ముఖాముఖి అభిప్రాయాలు తెలుసుకునేందుకు కమిషనర్ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రనాయుడు మాట్లాడుతూ 1965లో వాల్మీకిగా ప్రభుత్వం గుర్తించి తనకు సర్టిఫికెట్ మంజూరు చేసిన విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్టీగా ఆనాడు ఉన్నందువల్లే తనకు ఉపాధ్యాయుని ఉద్యోగం లభించిందన్నారు. నేడు బీసీ-ఏలో బోయలు ఉన్నందున తమ బిడ్డలు ఉన్నత చదువులు చదివినా రిజర్వేషన్ మూలంగా కొలువులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి ముతాక్షలకు దూరంగా తమ బిడ్డలను బతికించుకొని, చదివించుకున్న వారు నేడు తమ బిడ్డలను విద్యావంతులైనా నిరుద్యోగులుగా మిగిలిపోవడం చూసి కుమిలిపోతున్నారన్నారు. గతంలో ఉన్న విధంగా తమను ఎస్టీలుగానే పరిగణించేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా 1965లో తనకు పాణ్యం రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఎస్టీ సర్టిఫికెట్, 10వ తరగతి టీసీలను రామచంద్రనాయుడు అధికారులకు అందజేశారు.



తన ఎస్టీ సర్టిఫికెట్‌ను అధికారులకు చూపుతున్న రామచంద్రనాయుడు

క్లుప్తంగా

ఏపీ వాలీబాల్ జట్టులో కర్నూలు క్రీడాకారిణులు



శరణ్య



ప్రేమకుమారి

కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్టుకు కర్నూలుకు చెందిన శరణ్య, ప్రేమకుమారి ఎంపికయ్యారు. గత నెల డిసెంబర్ 21 నుంచి 23 వరకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ చాటారు. దీంతో ఏపీ జట్టుకు వీరిని ఎంపిక చేశారు. ఫిబ్రవరి 2 నుంచి 9వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో నిర్వహించనున్న 71వ జాతీయ స్థాయి మహిళల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్టు తరపున వీరు ఆడనున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వీరిని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి అహ్మద్ షరీఫ్, జాఫర్ మున్నా అభినందించారు.

క్షుద్ర పూజల కలకలం



డోన్ రూరల్: కామగానికుంట్ల గ్రామ సమీపంలోని కనుమ తిమ్మరాయుని గుడికి వెళ్లే రహదారిలో క్షుద్రపూజలు చేయడంతో కలకలం రేగింది. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి గతంలో తిమ్మరాయుని గుడికి వెళ్లే రహదారిలో కింద పడ్డాడు. ఆరోజు నుంచి అతనికి ఆరోగ్యం సరిగా లేక పోవడంతో కింద పడిన చోట పూజలు చేయాలని డోన్‌కు చెందిన గొల్ల సుధాకర్ సలహా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం అర్ధరాత్రి తర్వాత రాఘవేంద్ర, గొల్ల సుధాకర్, వెంకటాపురం గ్రామానికి చెందిన రామనాయుడు అక్కడికి చేరుకుని పూజలు చేపట్టారు. గ్రామస్తులకు సమాచారం అందడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ముగ్గురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

స్వర్ణ పతకం సాధించిన ఆదోని క్రీడాకారుడు



స్వర్ణ పతకంతో కిరణ్‌కుమార్

ఆదోని అర్బన్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్ యంగ్ మూడ్ పోటీల్లో ఆదోని పట్టణానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు కిరణ్‌కుమార్ స్వర్ణ పతకం సాధించాడు. ఆంధ్ర టీం తరపున పాల్గొని ఈ పతకం సాధించినట్లు కోచ్ దాదాబాషా తెలిపారు. కిరణ్‌కుమార్‌కు ఇది వరుసగా ఐదో స్వర్ణ పతకమన్నారు.

కాలేజీ బోర్డు తిప్పేసింది.. న్యాయం చేయండి

- పోలీస్ స్పందనలో ఫిర్యాదు చేసిన విద్యార్థులు

కర్నూలు: కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామ శివారులో ఉన్న గ్రీన్ ల్యాండ్స్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కాలేజ్ బోర్డు తిప్పేసి తమను మోసం చేసిందని కొందరు విద్యార్థులు పోలీస్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఫీజులు తీసుకుని యూనివర్సిటీకి చెల్లించలేదని, సర్టిఫికెట్లు కూడా వాపసు ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీలు కృష్ణకాంత్ పటేల్, డి.ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 90 ఫిర్యాదులు వచ్చాయి. కుమారుడు లారీ ఆక్సిడెంట్‌లో చనిపోయాడని, లారీ యజమాని నుంచి నష్టపరిహారం ఇప్పించి కుటుంబానికి న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన జయమ్మ కోరారు. అత్తను ఆడపడచు మోసం చేసి స్థిరనివాసమైన ఇంటిని తన పేరున రిజిస్టర్ చేయించుకుని తమ కుటుంబానికి అన్యాయం చేసిందని పత్తికొండ మండలం దూదెకొండ గ్రామానికి చెందిన బోయ సుశీలమ్మ ఫిర్యాదు చేశారు. మనీ బూస్టర్ కంపెనీలో పెట్టుబడులు పెట్టించి కొందరు వ్యక్తులు తనను మోసం చేశారని, విచారణ జరిపించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గార్లదిన్నె గ్రామానికి చెందిన ఈరేష్ ఫిర్యాదు చేశారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని బాధితులకు ఏఎస్పీలు హామీ ఇచ్చారు. డీఎస్పీలు నాగభూషణం, వెంకట్రాద్రి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో పాల్గొన్నారు.

రెండు ఎకరాల పొలం కోసమే జంట హత్యలు

- భార్య, అత్తను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: రెండు ఎకరాల పొలం కోసమే భార్య, అత్తలను కె.సి. నాగరాజు అనే వ్యక్తి హత్య చేసినట్లు ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కె.సి. నాగరాజును అరెస్ట్ చూపించారు. డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పెద్దకడుబూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన కె.సి. నాగరాజు, భార్య కె.సి. శాంతి ముగ్గురు పిల్లలతో కలసి నివాసముంటున్నారు. అత్త కె. లక్ష్మి పేరున ఉన్న రెండు ఎకరాల పొలం తన పేరున రాసి ఇవ్వాలని నాగరాజు మద్యం సేవించి గొడవ పడేవాడు. ఇదే విషయంలో ఈ నెల 27న భార్య, అత్తలతో గొడవ పడి, మద్యం మత్తులో ఆవేశంలో వేటకొడవలితో భార్య కె.సి. శాంతి, అత్త కె. లక్ష్మిలను విచక్షణరహితంగా నరికి హత్య చేశాడని తెలిపారు. నిందితుడి కుమార్తె చైత్ర ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. నిందితుడి కోసం గాలిస్తుండగా సోమవారం ఉదయం రాగిమాన్‌దొడ్డి గ్రామం బయట ఎల్లెల్సీదగ్గర అనుమానంగా తిరుగుతుండగా పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా తానే ఆస్తి కోసం హత్యచేసినట్లు ఒప్పుకోవటంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో కోసిగి, ఎమ్మిగనూరు టౌన్ సీఐలు ఎరిషావలీ, మధుసుధన్‌రావు, పెద్దకడుబూరు ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



నిందితుడు నాగరాజు అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్, కోసిగి సీఐ ఎరిషావలి

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపి, పరిష్కారం పొందాలని సూచించారు.

జీవితానికి 'వెలుగు'

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఇటీవల ఫ్లెక్సీలు, ప్లాస్టిక్‌ను నిషేధించడం తెలిసిందే. ఇప్పటి వరకు ఫ్లెక్సీల విచ్చలవిడి వినియోగంతో పెయింటర్స్‌కు ఉపాధి లేకుండా పోయింది. తాజాగా నిషేధం అమల్లోకి రావడంతో పెయింటర్స్ జీవితాల్లో వెలుగు వస్తోంది. కర్నూలు నగరానికి చెందిన పెయింటర్ వెంకటేష్ సోమవారం రాత్రి తన సెల్‌ఫోన్ వెలుతురులో సెంట్రల్‌ప్లాజాలోని స్టేట్ బ్యాంకు కార్యాలయానికి పెయింటింగ్ పనులు చేస్తుండటం చూస్తే ఆ విషయం నిజమనిపిస్తుంది.

– ఫొటో: డి.హుస్సేన్



ఏపీ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం ఆలూరులో పశుఆరోగ్య సేవారథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యాధుల బారిన పడిన పశువులను రక్షించుకునేందుకు రైతులు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసిన వెంటనే మొబైల్ క్లినిక్ అందుబాటులోకి వస్తుందన్నారు. పశువులు ఉన్న చోటికే వచ్చి వైద్య సిబ్బంది చికిత్సలు అందిస్తారన్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పశు ఆరోగ్య సేవా రథాలను అందుబాటులోకి తెచ్చిందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆలూరు పశు సంవర్ధకశాఖ సంచాలకులు విక్టర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత గుమ్మనూరు నారాయణ స్వామి, ఆస్పరి, ఆలూరు మండల కన్వీనర్లు వీరేష్, పెద్దయ్య, ఆస్పరి సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్, కో-కన్వీనర్ హనుమయ్య, చిప్పగిరి మండలం వైఎస్సార్‌సీపీ నాయకుడు మారయ్య, ఆస్పరి ఏడీఏ వెంకటసుబ్బయ్య, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు విరాళం: ఆస్పరి మండలం అలిగేర గ్రామంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోమవారం ఆ గ్రామ వాల్మీకి కులస్తులకు రూ 50 వేలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, ఆస్పరి సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్, మండల కన్వీనర్ పెద్దయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి పశు ఆరోగ్య సేవారథాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

పశుఆరోగ్య సేవారథాలు ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవారథాలను పలు నియోజకవర్గాల్లో సంబంధిత శాసనసభ్యులు ప్రారంభించారు. మొదటి విడుతలో కర్నూలు జిల్లాకు 7, నంద్యాల జిల్లాకు 7 ప్రకారం సంచార పశు ఆరోగ్య సేవారథాలు వచ్చాయి. రెండో విడతలో కర్నూలు జిల్లాకు 6, నంద్యాల జిల్లాకు 7 ప్రకారం ప్రకారం వచ్చాయి. సోమవారం పత్తికొండ నియోజకవర్గంలోని కృష్ణగిరిలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరులో ఎమ్మెల్యే సుధాకర్, ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల నియోజకవర్గం గోస్పాడులో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి.. వైఎస్సార్ సంచార పశుఆరోగ్యసేవా రథాలను ప్రారంభించారు. దీంతో పాణ్యం మినహా అన్ని నియోజకవర్గాల్లో వీటిని ప్రారంభించినట్లు అయింది. రెండో విడత వాహనాలను మరింత ఆధునాతనంగా తయారు చేశారు. మూగజీవాల సేవలో ఉమ్మడి జిల్లాలో 27 సంచార పశు ఆరోగ్య సేవా రథాలు ఉండటం విశేషం. పశువైద్య సేవలను మరింత మెరుగు పరిచేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1962కు మరింత ప్రాచుర్యం కల్పించనున్నారు. అంబులెన్స్‌లను ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీస్ నిర్వహిస్తోంది.

నిందితుడికి రిమాండ్

కోవెలకుంట్ల: సంజామల మండలం అల్వకొండ గ్రామంలో ప్రేమ పేరుతో ఓ యువతిని మోసం చేసిన కేసులో నిందితుడికి మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం సీఐ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ఓ యువతిని ఇదే గ్రామంలో ఆర్ఎంపీగా పనిచేస్తున్న రాజేష్ పెళ్లి చేసుకుంటానని మాయమాలు చెప్పి గర్భిణిని చేశాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండా తప్పించుకు తిరగడంతో మోస పోయిన యువతి ఈ నెల 27న సంజామల పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని ఎస్ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో ఆకుమల్ల క్రాస్ సమీపంలో అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

2న ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 2న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్-19 విభాగంలో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్చరీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.


కర్నూలు జిల్లాకు డబుల్ క్రౌన్

నంద్యాల(అర్బన్): అండర్-14 బాల బాలికల రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో కర్నూలు జిల్లాకు డబుల్ క్రౌన్ దక్కింది. ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన త్రోబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో కర్నూలు, ద్వితీయ స్థానంలో చిత్తూరు, తృతీయ స్థానంలో వైజాగ్ జట్లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం కర్నూలు, ద్వితీయ స్థానం అనంతపురం, తృతీయ స్థానం చిత్తూరు జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయిగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, కర్నూలు జిల్లా శాప్ కో ఆర్డినేటర్ శ్రీనాథ్, క్రీడా సమాఖ్య నంద్యాల జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర సీఎం కప్ కో ఆర్డినేటర్ ఏపీరెడ్డి హాజరయ్యారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. ఉత్తమ క్రీడాకారుల అవార్డులు శ్రీహరి, మనోజ్ఞనను వరించాయి. ఆయా జట్లలో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

జాతీయ స్థాయి జట్లు:

బాలుర జట్టు: మహేష్, శరత్‌కుమార్‌రెడ్డి, రాజ్‌కుమార్, చైతన్య, వంశీకృష్ణ, జన్నత్, మత్యరాజు, రిచార్డ్ డేనియల్, శివసాయిరెడ్డి, సాయినాథ్, ప్రసాదరెడ్డి, శ్రీహరి .

బాలికల జట్టు: మనోజ్ఞా, పూజిత, సుజాత, దివ్య, అంకిత, బృంద, హర్షిణిరెడ్డి, మహిత, నర్సమ్మ, లాస్యప్రియ, ఇందూ, కీర్తన.

త్రోబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచి డబుల్ క్రౌన్ సాధించిన కర్నూలు జిల్లా బాలురు, బాలికలు